సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



పనుల్లేక పస్తులు

ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు నిలిచి పోయాయి. కార్మికులు పనులు లేక రోడ్డున పడుతున్నారు.

- 8లో



రోగులను వేధిస్తే కఠిన చర్యలు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద వైద్యం చేయించుకునే రోగులను డబ్బుల కోసం వేధిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

- 8లో

27న ఆదిత్యుని హుండీ లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను ఆలయ అనివెట్టి మండపంలో ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిపించి, నిబంధనల ప్రకారం లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నకిలీ జీఎస్టీ అధికారులతో జాగ్రత్త

శ్రీకాకుళం: నకిలీ అధికారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వాణిజ్య పన్నుల శాఖ సహాయ సంచాలకులు రాణిమోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పరిణామాల దృష్ట్యా వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. 2017 నుంచి జీఎస్టీ చట్టం అమల్లో ఉందని, అప్పటి చట్టంలో సవరణలు వస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. తదనుగుణంగా వ్యాపారులకు సమాచారం అందజేస్తున్నామని తెలిపారు. ఇటీవల కొందరు నకిలీ వ్యక్తులు జీఎస్టీ అధికారులంటూ చెబుతూ సంబంధిత సంస్థల్లోకి చొరబడుతున్నారని పేర్కొన్నారు. ఎవ్వరైనా జీఎస్టీ అధికారులమని వస్తే ఐడీ చూపించాలని అడగాలని, అనుమానం వస్తే సమీపంలోని సహాయ కమిషనర్‌తో మాట్లాడి నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో నాలుగు సర్కిలు ఉన్నాయని పేర్కొన్నారు. నకిలీ అధికారుల సమాచారం తెలిస్తే శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్ 9949992369, ఆమదాలవలస 9949991784, నరసన్నపేట 9492049454, కాశీబుగ్గ 9949998568 నంబర్లకు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని కోరారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్లో 17వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే బ్యాచ్‌లో 16 మందికే అవకాశం ఉంటుందని, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఫీజు, ఇతర వివరాలకు 7382923293, 7095040608, 7382924758 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శభాష్ పోలీస్!



108 వాహనంలో చికిత్స పొందుతున్న మహిళ

గార: పాము కాటుకు గురైన మహిళను రాత్రి విధుల్లో ఉన్న మహిళా పోలీసులు సకాలంలో అప్రమత్తమై సహాయక చర్యలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి బందరువానిపేటకు చెందిన పుక్కళ్ల కాంతమ్మ పెళ్లిలో వంట పనులు ముగించుకొని గార నడుచుకుంటూ వస్తోంది. పోలీస్‌స్టేషన్ సమీపంలో పాముకాటు వేయడంతో భయంతో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుంది. వెంటనే స్పందించిన మహిళా కానిస్టేబుల్ ఉషారాణి, హోమ్‌గార్డు రాజ్యలక్ష్మీలు 108కి ఫోన్ చేసి గార పీహెచ్‌సీలో చేర్పించి వైద్యం అందించారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. సకాలంలో స్పందించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం అభినందించారు.

ముంచుకొచ్చిన ఉప్పటేరు



బూర్జపాడు కాజ్‌వే పైనుంచి పారుతున్న ఉప్పుటేరు

ఇచ్ఛాపురం రూరల్ : మండలంలోని బూర్జపాడు వద్ద ఉప్పుటేరు ముంచుకొచ్చింది. పౌర్ణమి సందర్భంగా బంగాళాఖాతంలో ఏర్పడిన ఆటుపోట్ల బంగాళాఖాతంలో ఉప్పుటేరు కలిసే ప్రాంతంలో పొగురు (ఇసుక మేటలు) వేయడంతో మూడు రోజుల నుంచి ఉప్పుటేరు పంట పొలాల వైపు మళ్లింది. దీంతో వరినాట్లు మునిగిపోయాయి. ఒడిశాలో కురిసిన వర్షాలకు పిల్లకాలువల ద్వారా వచ్చిన వరదనీరు సైతం సముద్రంలో కలిసే అవకాశం లేకపోవడంతో బూర్జపాడు కాజ్‌వే మీదుగానే నీరు పారుతోంది. ఒకవైపు సముద్రానికి ఆనుకుని పారుతున్న ఉప్పుటేరు, మరోవైపు బాహుదానది నుంచి వచ్చిన వరద నీరు కలిసి పంట పొలాల్లోకి చొచ్చుకుపోవడంతో నారుమడులు మునిగిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక మేటలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

బదిలీల మినహాయింపుపై హర్షం

శ్రీకాకుళం అర్బన్: 2025 మార్చి 31లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులందరికీ ప్రస్తుత సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు హర్షం తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 62 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు తాజా బదిలీలతో ఇబ్బందులకు గురయ్యే అవకాశమున్నందున మినహాయింపు ఇచ్చారని పేర్కొన్నారు.

“ అమానుషం



నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై దాడులు చేసి చంపడం అమానుషం. మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి సౌకర్యాలు, భరోసా కల్పించినప్పుడే ధైర్యంగా వైద్యసేవలు అందివ్వగలరు.

– డాక్టర్ సి.పి.శ్రీదేవి, రిమ్స్ ఏఆర్ఎంఒ, శ్రీకాకుళం



కవిటి: కోల్‌కతా ఘటనకు నిరసనగా పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో నివాళులు అర్పిస్తున్న చిన్నారులు



“ భద్రత కల్పించాలి




ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి మరింత భద్రత కల్పించాలి. ఆస్పత్రుల వద్ద నిఘా పెంచాలి. వైద్యులు, సిబ్బందిపై దాడి జరిగిన వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించాలి. జాతీయ రక్షణ చట్టాన్ని తక్షణం అమలు చేయాలి.

–డాక్టర్ సుజాత, శిశువైద్య నిపుణురాలు, రిమ్స్ ఆస్పత్రి

లబ్ డబ్!

లయతప్పుతోంది



- యుక్త వయసులోనూ హృద్రోగ మరణాలు
- 30 ఏళ్లలోపు బాధితులే అధికం
- జిల్లాలో 23 శాతం మందికి ముప్పు ఉందని సర్వేలో వెల్లడి
- చెడు అలవాట్లు, మారిన జీవన శైలే కారణమంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

- గతంలో ఆసుపత్రులకొచ్చే 70 ఏళ్ల పైబడిన వారిలో 30 శాతం వరకు గుండె సమస్యలొచ్చేవి. 60 ఏళ్ల దాటిన వారిలో 20 శాతం, 50 ఏళ్ల దాటిన వారిలో 10 శాతం మందే గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. 30 ఏళ్లలోపు వారికీ గుండె సమస్యలొస్తున్నాయి. ఏకంగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి.
- ఒకప్పుడు 25 ఏళ్ల నుంచి 40 వయసులో హృద్రోగ సమస్యలు రావడం వైద్యులు అరుదుగా చూసేవారు. ఇప్పుడా వయసున్న వారిలో 100 మందిలో 25 శాతం మందికి గుండె సమస్యలొస్తున్నాయి. వచ్చిన స్ట్రోక్‌లు కూడా సీరియస్‌గా వస్తున్నాయి.



- ఒకప్పుడు 40 ఏళ్లు దాటిన వాళ్లకి ఈసీజీ, టుడీ ఎకో, టీఎంటీ చేసుకోవాలని వైద్యులు సూచించే వారు. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా పరీక్షలు చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.
- గతంలో జనరల్ ఓపీకి వచ్చే యువతలో 5 శాతం హృద్రోగ కేసులు రావడం అరుదు. ఇప్పుడా యువతలో 10 నుంచి 15 శాతం వరకు గుండె సమస్యలు కనిపిస్తున్నాయి. ఈసీజీ, టుడీ ఎకో, టీఎంటీ వంటి పరీక్షలు చేసుకుంటే గుండె సమస్యలు బయట పడుతున్నాయి.

ఇటీవల కాలంలో గుండెపోటుతో యువకులు చనిపోయిన ఘటనలు ఎక్కడికక్కడ చూస్తున్నాం. చూస్తుండగానే కుప్పకూలిపోతున్నారు. ఏటా



ఆరోగ్యశ్రీ కింద చేస్తున్న గుండె శస్త్ర చికిత్స సంఖ్యను చూస్తుంటే జిల్లాలో ఏ స్థాయిలో గుండె సమస్యలు పెరిగాయో అర్థం చేసుకోవచ్చు.



తంగుడు సుధీర్ (ఫైల్)

టెక్కలికి చెందిన 31 ఏళ్ల తంగుడు సుధీర్ ఈ నెల 20న గుండె పోటుతో మృతి చెందాడు. యువకునికి హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు గుండెపోటుగా తేల్చారు

జాగ్రత్తలే శ్రీరామరక్ష..

- ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం తప్పనిసరి.
- అస్థిరంగా రొమ్ము నొప్పి, రక్తపోటు అధికమవడం, గుండె పని విధానంలో అసాధారణంగా ఉండటం లాంటివి కన్పించగానే వైద్యుడ్ని సంప్రదించాలి.
- ధూమపానం, మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారం, శారీరక స్తబ్దత / ప్రమాదకార కారకాలుగా మారాయి. ఈ నేపథ్యంలో వాటికి దూరంగా ఉండాలి.
- వేళకు ఆహారం తీసుకోవాలి. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలి.

ఆరోగ్య శ్రీ కింద జిల్లాలో జరిగిన శస్త్ర చికిత్సలు

సంవత్సరం	కేసులు
2022-23	6323
2023-24	7724
2024-25 (ఇప్పటివరకు)	3392

ప్రధాన కారణాలివే..



ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లు, రోగం వస్తే నిర్లక్ష్యం చేయడం, కోవిడ్ వచ్చాక జాగ్రత్తలు తీసుకోకపోవడం, పోస్టు కోవిడ్‌లో భాగంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోకపోవడం, పోషకాహారం, వ్యాయామం, విశ్రాంతి తీసుకోకపోవడం, దినచర్యలో ఒత్తిడికి గురవ్వడంతో హృద్రోగ సమస్యలు ఎదురవుతున్నట్టుగా వైద్యులు చెబుతున్నారు. గతంలో 50 ఏళ్లు దాటాకే గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేసుకునేవారు. తాజా పరిణామాలతో ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రిస్క్‌లో 23 శాతం..



ప్రజల ఆరోగ్య చరిత్రను కోవిడ్‌కు ముందు, కోవిడ్ తర్వాత అన్నట్టుగా చూడాల్సి వస్తోంది. కరోనా సమయంలో తీసుకున్న వైద్యం తర్వాత ఫాలోఅప్ చేయకపోవడమో, ఆ వ్యాధి ప్రభావమో తెలియదు గానీ హృద్రోగ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గతేడాదిలో జరిగిన ఓ సర్వేలో జిల్లాలో 23 శాతం మంది గుండె సమస్యకు ఆస్కారమిచ్చే జబ్బులతో బాధపడుతున్నట్టుగా తేలింది.

“ అలవాట్లు మారాలి



చెడు అలవాట్లు, జీవన శైలి కారణంగా యువతలో గుండె సమస్యలొస్తున్నాయి. అలవాట్లు, ఆహారపు పద్ధతులు మెరుగుపర్చుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ప్రతిఒక్కరూ ఒత్తిడికి, జంక్ ఫుడ్స్‌కి దూరంగా ఉంటూ వ్యాయామం చేయడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చు.

– డాక్టర్ ఎల్.కె.విజయకుమార్, కార్డియాలజిస్ట్, శ్రీకాకుళం

పరిశ్రమల్లో భద్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలో అన్ని పరిశ్రమలు రానున్న రెండు వారాల పాటు భద్రతా చర్యలపై శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని భారీ, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ మాట్లాడారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అమ్మోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యూటేన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రత ప్రమాణాలు ఉండాలన్నారు. అనంతరం ప్రణాళిక విభాగం, సెర్ప్, రెస్క్యూ యూనిట్, ఉపశమనం, పునరావాసం, కమ్యూనికేషన్, రవాణా, లాజిస్టిక్, అత్యవసర సమయంలో వైద్య సదుపాయాలపై సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఏడీ రమణారావు, జిల్లా అగ్ని మాపకశాఖ అధికారి మోహనరావు, పర్యావరణ శాఖ ఇంజినీర్ రామారావు నాయుడు, రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యునైటెడ్ బ్రూవరీస్, నాగార్జున అగ్రికెమ్, అరబిందో ఫార్మా, ఆంధ్రా ఆర్గానిక్, స్మార్ట్ కెమ్ టెక్నాలజీ, విశాఖ డెయిరీ, సరాఖ ల్యాబ్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసుల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ (చిత్రంలో) ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి వంటి మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తు, ప్రాపర్టీ స్వాధీనం చేసుకోవడానికి చట్టప్రకారం నిబంధనలు పాటించాలని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో డ్రగ్స్, సైబర్ కేసుల దర్యాప్తు, నూతన చట్టాలపై రిటైర్డ్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏసీబీ కోర్టు, విశాఖపట్నం) కె.రామకృష్ణతో కలిసి పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. చట్టాలలో మార్పులు క్షుణ్ణంగా వివరించారు. అన్ని సెక్షన్లపై అవగాహన పెంచుకుని కేసులు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు లు వచ్చినప్పుడు ముందుగా 1930 నంబర్‌కు డయల్ చేయించి ఫిర్యాదు రిజిస్టర్ చేయించాలని సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, పోలీస్ లీగల్ అడ్వైజర్ యామిని రాణి, సీఐలు, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

• గోపాల.. గోపాల



కృష్ణాష్టమి సందడి ముందే వచ్చేసింది. వరుస సెలవుల నేపథ్యంలో చాలా పాఠశాలల్లో శనివారమే వేడుకలు నిర్వహించారు. గోపికలు, శ్రీకృష్ణుల వేషధారణలతో చిన్నారులు అలరించారు. శ్రీకాకుళం నగరంలోని ఓ పాఠశాలలో చిన్నారుల సందడిని ఇక్కడ చూడొచ్చు.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ

ఫరీదుపేటలో ఉద్రిక్తత

- టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి
- దోషులందరినీ అరెస్టు చేయాలంటూ అంబులెన్సును అడ్డుకున్న బంధువులు
- పోలీసులను నిలదీసిన నాయకులు
- రెండు రోజుల్లో నిందితులందరినీ అరెస్టు చేస్తామన్న పోలీసు అధికారులు
- గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు



అంబులెన్స్‌ను అడ్డుకున్న స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు



సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్ (ఫైల్)



పోలీసుల పహారా

సాక్షి టాస్క్ ఫోర్స్:

ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కూన ప్రసాద్ (26) చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. ఈ నెల 18న రాత్రి 11.15 గంటల సమీపంలో ప్రసాద్‌ను టీడీపీ వర్గీయులు తీవ్రంగా గాయపర్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ప్రసాద్ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. అక్కడే పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని పోలీసు బందోబస్తు నడుమ అంబులెన్స్‌లో ఫరీదుపేటకు తీసుకువచ్చారు.

అంబులెన్స్ ముందు ఆందోళన..

ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదంటూ ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులను నిలదీశారు. గ్రామంలోనికి అంబులెన్స్ రాకుండా అడ్డుకున్నారు. రోడ్డుపైనే బైఠాయించారు. తక్షణం అరెస్టు చేసే వరకు అంత్యక్రియలు నిర్వహించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు పోలీసులతో చర్చించారు. మీడియా సాక్షిగా పోలీసులు హామీ ఇస్తేనే మృతదేహం ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. దీంతో జేఆర్‌పురం సీఐ, కేసు దర్యాప్తు అధికారి మాట్లాడుతూ కేసుతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరినీ రెండు రోజుల్లో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని హామీఇచ్చారు. దీంతో స్థానికులు వెనక్కుతగ్గారు. అనంతరం అత్యక్రియలు నిర్వహించారు.

పేద కుటుంబంలో పెను విషాదం



కూన ప్రసాద్ (ఫైల్)

డ్రైవర్ ప్రసాద్ తల్లి చిన్నప్పుడే మృతి చెందగా, తండ్రి బతుకు తెరువు కోసం భీమవరం ప్రాంతంలో ఐస్‌క్రీమ్స్ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. తమ్ముడు గోవిందరావు సైతం రోజుకూలీగా పనిచేస్తున్నాడు. వైఎస్సార్ సీపీపై ఉన్న అభిమానంతో నాయకులతో కలిసి ఉండటం, గతంలో టీడీపీకి చెందిన వారితో కొంత శత్రుత్వం ఉండటం ప్రసాద్ ప్రాణాల మీదకు వచ్చింది. ప్రసాద్ మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

హత్యానేరంగా దర్యాప్తు..

తొలుత హత్యాయత్నం కేసులో 11 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరంతో ప్రమేయం ఉన్న వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రసాద్ మృతి చెందడంతో కేసును హత్యాయత్నం నేరం నుంచి హత్యా నేరంగా మార్చారు. ఈ మేరకు మృతుని తండ్రి వెంకటరావు నుంచి ఫిర్యాదు స్వీకరించిన జేఆర్‌పురం సీఐ అవతారం కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యాయత్నం ఎఫ్ఐఆర్‌లో ఉన్న పేర్లనే హత్య కేసు ఫిర్యాదులోనూ బాధితుడి తండ్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసును జేఆర్‌పురం సీఐతో పాటు పలు విభాగాలకు చెందిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నేరంతో సంబంధం ఉన్నవారిపై దాదాపుగా స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. నిందితులపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

గ్రామంలో పోలీస్ పికెట్...

ఇళ్లు, ఆస్తుల ధ్వంసం, వ్యక్తులపై దాడులు వంటివి జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలపై దృష్టి సారించారు. బందోబస్తు ఏర్పాటుతో పాటు పికెట్ నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం నుంచే అధిక సంఖ్యలో పోలీసులను మోహరించారు. ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు భద్రత సమీక్షిస్తున్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం దురదృష్టకరం: గొర్లె కిరణ్



మీడియాతో మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు కావడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండిపడ్డారు. పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయలేకపోతున్నారని చెప్పారు. గ్రామాల్లో నేరప్రవృత్తి పెరిగి యువతపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఆయనతో పాటు నాయకులు మీసాల వెంకట రమణ, కాయల వెంకటరమణ, డోల రమణ, రొక్కం బాలకృష్ణ, మీసాల సీతన్నాయుడు, మీసాల శ్రీనివాసరావు, సనపల నారాయణరావు, స్థానిక సర్పంచ్ కొత్త కోట పూర్ణచంద్రరావు, మీసాల వెంకటరమణ, ఎన్ని ధనుంజయరావు, బొడ్డేపల్లి సుధాకర్ పాల్గొన్నారు.



నిఘా పెంచాలి

ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిఘా పెంచాలి. మహిళా డాక్టర్లు, మహిళా వైద్య ఉద్యోగుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను తీసుకురావాలి. అలాంటి చట్టాలు అమలైనప్పుడే కోలకత్తా వంటి ఘటనలు పునరావృతం కావు.

– ఈ.వి.రమణమ్మ, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్, రిమ్స్ ఆస్పత్రి, శ్రీకాకుళం



ఎచ్చెర్ల: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ధర్మవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



చట్టాలు కఠినతరం చేయాలి

వైద్యులు, వైద్య సిబ్బందిపై అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలి. లేదంటే భవిష్యత్‌లో మరిన్ని దారుణాలు జరిగే పరిస్థితి ఉంటుంది. మహిళా ఉద్యోగులు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలి.

– ఎన్.వి.లక్ష్మి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్, రిమ్స్, శ్రీకాకుళం



క్లుప్తంగా

వర్సిటీలో డిజిటలైజేషన్



మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యమిస్తామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్. రజిని అన్నారు. వర్సిటీలో శనివారం ఉన్నత విద్యాశాఖ నిర్వహించిన వీసీల వర్చువల్ సమావేశంలో పాల్గొని, అనంతరం ఆమె మాట్లాడారు. వర్సిటీలో సాంకేతిక ప్రగతిని వినియోగించనున్నట్లు చెప్పారు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు డిజిటల్ లాకర్ విధానంలో పొందుపర్చనున్నట్లు తెలిపారు. స్కానింగ్, డిజిటలైజేషన్ పక్కాగా చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్ ఏఆర్ఎంఓగా డాక్టర్ శ్రీదేవి

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి అసిస్టెంట్ ఆర్ఎంఓగా డాక్టర్ సి.పి. శ్రీదేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న ఆమెను బదిలీపై రిమ్స్ ఏఆర్ఎంఓగా నియమించారు.

జనావాసాల్లోకి అలుగు



ఫాంహౌస్‌లోకి వచ్చిన అలుగు

సారవకోట: మండలంలోని అద్దపనస గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టా ఉమామహేశ్వరరావు ఫాంహౌస్ సమీపంలో శనివారం అలుగు ప్రత్యక్షమైంది. వెంటనే ఆయన అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. పాతపట్నం రేంజ్ ఆఫీసర్ ఆర్.రాజశేఖర్, సారవకోట సెక్షన్ అధికారి ఎల్.ఈశ్వరరావు, బీటీ ఆఫీసర్లు శివ ప్రసాద్, అజయ్‌లు ఫాంహౌస్‌కు చేరుకుని అలుగును పరిశీలించి అలుగు పిల్లగా గుర్తించారు. ఇది సమీపంలోని బక్కిరికొండ ప్రాంతం నుంచి చీమలు, చెద పురుగులు తినేందుకు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. దీనిని మాళువ రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు సిబ్బంది తెలిపారు. అరుదుగా కన్పించే అలుగును గుర్తించి తమకు సమాచారం ఇచ్చిన ఉమామహేశ్వరరావును అభినందించారు.

29న దోకులపాడులో కవి సమ్మేళనం

వజ్రకొత్తూరు: మండలంలోని దోకులపాడులో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న జిల్లా స్థాయి కవి సమ్మేళనం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే కవులందరికి గౌరవ సన్మానంతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందిస్తామని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు బహూకరిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు పేరు, చిరునామా, ఫొటో, కవిత, పాటను ఈ నెల 25వ తేదీలోగా 9827408575 నంబరుకు వాట్సాప్ చేయాలని కోరారు.

అనుమతి లేకుండా చిల్డ్రన్ హోమ్ నిర్వహణ

కొత్తూరు: హిరమండలంలో నిర్వహిస్తున్న గ్రేసీ చిల్డ్రన్ హోమ్‌కు అనుమతులు లేనందున మూసివేతకు చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణమూర్తి, జిల్లా ప్రొహిబిషన్ అధికారి రవికుమార్ తెలిపారు. హిరమండలంలో నిర్వహిస్తున్న గ్రేసీ చిల్డ్రన్ హోమ్, కొత్తూరులో నిర్వహిస్తున్న క్లూనీ చిల్డ్రన్ హోమ్‌ను శనివారం పరిశీలించారు. గ్రేసీ చిల్డ్రన్ హోమ్‌కు రికార్డులు లేకపోవడంతో పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. క్లూనీ చిల్డ్రన్ హోమ్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమములో కొత్తూరు సీడీపీవో విమలకుమారి, రక్షణ అధికారి మల్లేశ్వరరావు, ఎల్‌సీపీవో టి.లక్ష్మణరావు, సూపర్‌వైజర్లు ఎల్.శాంతకుమారి, కె.సుధావాణి పాల్గొన్నారు.

పనుల్లేక పస్తులు



నరసన్నపేట టౌన్‌లో ఆదివరపుపేట కూడలిలో పనుల్లేక ఉన్న భవన నిర్మాణ కార్మికులు

- భవన నిర్మాణ కార్మికుల ఆవేదన
- ఇసుక కొరతే కారణమని మండిపాటు
- ఆర్థిక సాయం అందించాలని సంఘ ప్రతినిధుల డిమాండ్

నరసన్నపేట: ఉచిత ఇసుక పేరిట రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరి కారణంగా జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరత వల్ల పనులు లేక పస్తులు ఉంటున్నారు. రోజూ గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రావడం, పనులు లేక ఉసూరుమంటూ తిరిగి గ్రామాలకు వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగడంతో తాపీమేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో ఉన్నారు. అందులో ఒక్క నరసన్నపేట నియోజకవర్గంలోనే 15 వేల కుటుంబాలు భవన నిర్మాణ పనులు ఆధారంగా జీవిస్తున్నాయి. వీరందరికీ ఇసుక కొరత ఇబ్బందులు తీసుకొచ్చింది. ఉచిత ఇసుక విధానం పేరుతో ఇసుక లభ్యతను దూరం చేయడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ రంగం పూర్తిగా స్తంభించిందని కార్మికులు వాపోతున్నారు. వీటి అనుబంధ రంగాలు కూడా వ్యాపారాలు లేక కుదేలవుతున్నాయి.

ఇతర రంగాలే దిక్కు..

ఇసుక అందించలేకపోతున్న ప్రభుత్వం.. భవన నిర్మాణ పనులు ఊపందుకున్న వరకూ కార్మికులకు నెలవారీ ఆర్థిక సహాయం అందించాలని నరసన్నపేట సంతోషిమాత భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు తర్ర లక్ష్మణరావు, ప్రతినిధులు బోర సూర్యనారాయణ, తర్లా వెంకటి, జనా నర్సింహులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరికొన్నాళ్లు ఇదే పరిస్థితి కొనసాగితే కార్మికులు ఇతర రంగాల వైపు మళ్లడం ఖాయమని చెబుతున్నారు. ఇసుక కొరత కారణంగా వందలాది భవనాల నిర్మాణం నిలిచిపోయిందని, కొత్త నిర్మాణాలు మొదలు కాలేదని అంటున్నారు. గతంలో శ్రావణమాసంలో అధిక సంఖ్యలో కొత్త పనులు మొదలయ్యేవని, ప్రతి మేస్త్రీకి చేతినిండా పనులు ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఒక్క పనీ మొదలు కాలేదని చెబుతున్నారు.

కష్టంగా ఉంది..



పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. రోజూ ఆదివారపుపేట సెంటర్‌కు రూ.50 చార్జీలు పెట్టుకొని వస్తున్నాం. పనుల్లేక తిరిగి వెళ్లిపోతున్నాం. చాలా కష్టంగా ఉంది. పనిదొరికి నెల రోజులవుతోంది. కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉంది. దీనంతటికీ ప్రభుత్వ ఇసుక విధానమే కారణం.

– అర్జునరావు, భవన నిర్మాణ కార్మికుడు, నడగాం

● పొలం..ఆహ్లాదకరం..



నరసన్నపేట మండలంలో రెడ్డికిపేట మొదలుకొని లుకలాం వరకూ వరి పొలాలు ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. మండలంలో దాదాపుగా ఖరీఫ్ వరి ఉభాలు పూర్తయ్యాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టడం, వాతావరణం అనుకూలించడంతో భూమికి ఆకుపచ్చని రంగు వేసినట్లు సుందరంగా దర్శనమిస్తున్నాయి. ఉర్లాం–జల్లువానిపేట మధ్య పంట పొలాలను ఇక్కడ చూడొచ్చు. – నరసన్నపేట

కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



మంత్రికి కొత్తమ్మతల్లి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకూ జరగనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో కొత్తమ్మతల్లి ఆలయ ఈఓ విజరాధాకృష్ణ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో టెక్కలి సబ్ కలెక్టర్ నేతృత్వంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఈఓను ఆదేశించారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని బైరి, కరజాడ పరిసర ప్రాంతం మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. బైరి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం రాత్రి నుంచే రెవెన్యూ అధికారులు మాటువేశారు. బైరి, కరజాడ ప్రాంతంలో ఇసుకను లోడ్ చేసి గార–కళింగపట్నం రోడ్డులో బూరవల్లి మీదుగా బైరి గ్రామాన్ని ఆనుకుని జాతీయ రహదారి మీదుగా ఇసుక లారీలు వెళ్తుండగా వీటిని పట్టుకున్నారు. ఒక ట్రిప్పర్ లారీను డ్రైవర్‌తో పట్టుకోగా మరో రెండు లారీలను వదిలేసి డ్రైవర్లు పరారయ్యారు. వెంటనే వీఆర్వోలు విషయాన్ని తహశీల్దార్‌కు సమాచారం అందించారు. వాహన నంబర్లు ఆధారంగా లారీ యజమానులకు సమాచారమిచ్చి డ్రైవర్లను శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి సీజ్‌చేశారు. అయితే పట్టుబడిన లారీల్లో ఉన్న ఇసుక తెల్లవారేసరికి మాయం కావడంతో రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

ట్రెంచ్ కొట్టినా ఫలితం లేదు..

ఇసుక అక్రమ రవాణాకు ఎన్ని అడ్డంకులు పెట్టినా ఇసుకాసురులు మాత్రం తమ వ్యాపారాన్ని ఏదోఒక రహదారి మీదుగా తరలించడం గమనార్హం. నదీ పరివాహక ప్రాంతాలకు వచ్చే మార్గాన్ని ఇటీవల తహశీల్దార్ సమక్షంలో ట్రెంచ్ కొట్టినా వాటిని రాత్రికి రాత్రే కప్పేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

నరసన్నపేట : లుకలాం నుంచి నరసన్నపేట వైపు అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తుండగా వీఆర్వోలు రాము, సూర్యనారాయణ గొట్టిపల్లి వద్ద శనివారం పట్టుకున్నారు. అనంతరం నరసన్నపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు మధ్యంతర కమిటీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన ఇసుక పాలసీ అమల్లోకి వచ్చే వరకు అక్రమ ఇసుక రవాణాను నియంత్రించేందుకు మధ్యంతర కమిటీ నియమించినట్టు శ్రీకాకుళం రెవెన్యూ డివిజినల్ అధికారి సీహెచ్ రంగయ్య తెలిపారు. కమిటీలో ఆర్డీవోతోపాటు తహసీల్దారు, గ్రామ రెవెన్యూ అధికారులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. శ్రీకాకుళం మండలంలో నది తీర ప్రాంతంలో ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ అధికారులుగా ఉంటారని తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని ఇటీవల బదిలీల్లో భాగంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.చిరంజీవి (జె.ఆర్.పురం), జి.లక్ష్మణరావు (లావేరు), జి.రంజిత్ (పోలాకి)లు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులో ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు చూరగొనాలన్నారు.

డబ్బుల కోసం రోగులను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద వైద్యం తీసుకొనే రోగులను డబ్బుల కోసం వేధిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్ల నుంచి ఏ విధమైన నగదు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెరుగైన వైద్యం అందించే బాధ్యత ఆరోగ్య మిత్రలదేనన్నారు. వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశరావు మాట్లాడుతూ వైద్య పరీక్షల చార్జీలు డిస్‌ప్లే చేయాలన్నారు. సెకండరీ పరీక్షలకు కూడా నగదు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వచ్చే బాధితులకు అక్కడ వైద్యం లేకపోతే ఎక్కడైతే ట్రీట్ మెంట్ ఇస్తారో ఆ ఆసుపత్రుల పేర్లు కచ్చితంగా తెలపాలన్నారు. భోజనం మెనూలో పాలు, పండ్లు ఉంచాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీకాంత్, జెమ్స్ జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కిమ్స్ సోమేశ్వరరావు, మెడికవర్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

హరిత క్యాంపస్ లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని హరిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నామని వీసీ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శనివారం క్షేత్ర ప్రచార శాఖతో కలిసి ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లి పేరిట మొక్క నాటటం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటటం, పెంచటం బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం–పరిశుభ్రత వల్లే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో క్షేత్ర ప్రచారశాఖ అధికారి బి.తారప్రసాద్, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను కాపాడుకుందాం



సీడీని ఆవిష్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: కళలు, సంప్రదాయ వృత్తులు అంతరించిపోకూడదని, వాటికి జిల్లాలో ప్రత్యేక స్థానం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో కళలు, చేతి వృత్తులు అనే అంశంపై భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ(ఇంటాక్) శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో చైతన్యసదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ జిల్లాలో సంస్కృతులు, సంప్రదాయ కళలు, ఖాదీ, చేతి వృత్తుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా జానపద గీతాలు, నాటక రంగ నృత్యాలు, గేయాలు, తప్పెటగుళ్లు, శివబాగోతం, బుర్రకథలు, మైమై గుర్రం, నెమలి నాట్యం కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు కన్వీనర్ వి.జగన్నాథంనాయుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఎల్.రామలింగస్వామి, సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, కె.రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, విష్ణుమూర్తి తదితరులు కళల ఆవశ్యకతపై ప్రసంగించారు. అనంతరం సాంస్కృతిక గీతాలు, నృత్యాల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈఓ మాధవి, మన్యం సహజ ఉత్పత్తి దారుల కంపెనీ ప్రతినిధి బి.శంకరరావు, సిక్కోలు చేనేత ఉత్పత్తి ప్రతినిధి బి.అప్పలనాయుడు, ఉర్లం శివతేజ, నాటక ప్రతినిధి రాజేశ్వరి, పొందూరు ఖాదీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

నరసన్నపేట : యువత డిగ్రీ పట్టాలతో పాటు నైపుణ్యతను పెంపొందించుకున్నప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. నరసన్నపేటలోని జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో శనివారం హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్ పాసైన విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ అభిరుచులకు, ఆలోచనలకు అనుగుణంగా స్కిల్స్ డెవలప్ చేసుకోవాలన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని వివరించారు. జాబ్ మేళాకు 120 మంది హాజరు కాగా 18 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రతినిధి వంశీ, హెచ్‌సీఎల్ హెచ్‌ఆర్ యోగేష్‌కుమార్, విశ్రాంత ఆర్‌ఐఓ రుక్మాంగధరరావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ప్రిన్సిపల్ కృష్ణారావు పాల్గొన్నారు.

దున్నూరులో ఎలుగు హల్‌చల్



మందస మండలం దున్నూరులో శనివారం ఎలుగుబంటి హల్‌చల్ సృష్టించింది. పట్టపగలే రోడ్డుపైకి రావడంతో స్థానికులు పరుగులు పెట్టారు. కొందరు ధైర్యంతో రాళ్లు విసరడంతో కొండపైకి వెళ్లిపోయింది. –కాశీబుగ్గ

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

వజ్రపుకొత్తూరు : మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన మత్స్యకారుడు సూరాడ అప్పలస్వామి (61) వేటకు వెళ్లి వస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలో వేటకు వెళ్లిన అప్పలస్వామి తిరిగి ఒడ్డుకు చేరుకుని లంగరు వేసేందుకు తాడు లాగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి మత్స్యకారులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వజ్రపుకొత్తూరు ఏఎస్‌ఐ జిన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా చేయించారు. మృతుడి కుమారుడు ఎస్.లింగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

టెక్కలి రూరల్: మండలంలోని చిన్ననారాయణపురంలో శనివారం మధ్యాహ్నం ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలోపే స్థానిక యువకులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

విద్యార్థినికి వేధింపులపై విచారణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే తరగతికి చెందిన విద్యార్థి వేధించడంపై శనివారం విచారణ చేపట్టారు. విద్యాశాఖ, చైల్డ్‌లైన్ సభ్యులు బృందాలుగా వీడి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ హైస్కూల్ హెచ్‌ఎం చిన్నంనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని, మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పిస్తామన్నారు.

స్వీయ పరీక్ష విధానంపై పునరాలోచించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన స్వీయ పరీక్ష విధానంతో పాఠశాలల్లో విలువైన పనిదినాలు వృథా అవుతాయని, దీనిపై పునరాలోచన చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.